# పతిభక్తి

## 1

'ఇందులో నా తప్పేముందో ఆలోచించి చెప్పండి. నిష్కారణంగా ఈ అపవాదు పడ్డం నా కెంతమాత్రం ఇష్టం లేదు. మొన్న మా మరదలు మటుకు మా మరదలన్నదా లేదా ?. మా అక్కయ్య నీకు చాతబడి చేస్తున్నదట, ఏమిటని. మొగుడూ పెళ్లాలమధ్య లక్ష గ్రంథం నడుస్తూందిగాక! అదంతా లోకం పొత్తయిపోయి ఈ విధంగా నన్ను బాధించడ మనేదున్నదే. చాలా శోచనీయమే కాకుండా లజ్జిన యేడవాలిసిన సంగతి నే నంతకన్న నొక్కి చెప్పలేను.'

నిజమే! నాకు ఆడవారు భర్తలయందు భయభక్తులూ, వినయ విధేయతలూ కలిగి దాసాను దాసులయి వుంటే చూడాలని వుంటుంది. అంత మాత్రం చేతనే నన్ను పసిపిల్ల బాలాది పర్యంతం వెర్రాసుపత్రికి పోతున్నవాణ్ణి చూసినట్లు చూడక్కర్లేదు. నాకూ ఈ కాలపు పద్ధతులు నచ్చకపోలేదు. క్రాపింగులు పెట్టుకోండి, మైల గుడ్డలతో

భోజనం చెయ్యండి, శూద్రవాళ్ళతో కలిసి ఒక బంతినే భోజనా లఘోరించండి. నే నడగను. ఎలాగో కలికాలం ఈ విధంగా వర్ణించే వుండిట. కాని ఆడవాళ్ళకు స్వేచ్ఛ యిచ్చి కులకమనటానికి నా అంతరాత్మను నిలువునా చీల్చినా ఒప్పదు. వాళ్ళను ఖైదీలక్రింద వుంచి ఒక కాలితో ఒత్తిపట్టక పోతే-అమ్మో! స్త్రీ బుద్ధీ ప్రళయాంతకహో అన్నవాడు వెర్రివాడా!

నా కింత మాత్రం ఆలోచనే వెళ్ళప్పుడుంటే పెళ్ళి చేసుకోకనే పోదును. కాని నా పెళ్ళి నాకు చాలా చిన్న తనంలోనే అయిపోయింది. ఏం చెయ్యను? ఆ భగవంతుడు నా యందు ఇంతకూ దయ ఉంచలేదు. నా భార్యకు ఇతర స్త్రీలందరికీ ఉన్న దుర్గుణాలన్నీ వున్నై. ఒకటి నవ్వడం. పురాణాల్లో పతివ్రతలను తీసుకోండి. వాళ్ళెక్కడైనా నవ్వి నట్లు నిదర్శనం వుందేమో చూడండి. యెందుకుంటుంది! ఆడది నవ్వితే నా కంతా ఇంతా మంట కాదు. చక్కగా, గంభీరంగా వుండలేరూ? అసలు నవ్వు నాలుగందాల చెరుపని ఊరికే అన్నారా యేమిటి? రెండో దుర్గుణం- అతిగా మాట్లాడటం. పతివ్రతకు-అనగా సర్వకాల సర్వావస్థల యందూ మొగుడిసంగతి విచారించేవానికి - అంత మాట్లాడటానికి అవకాశం యెక్కడుంటుంది? ఒకళ్ళతో ఒకళ్ళు ఎక్కువగా మాట్లాడుకోటం ఒకటి, మగవాళ్ళతో మాటకు మాట సమాధానం చెప్పటం ఒకటి, ఇటువంటి దుర్గుణాలు సామాన్యంగా ఆడవాళ్ళందరికీ వున్నై. నా దురదృష్టంచేత

అన్నీ నా భార్యకూ అబ్బినై. ఏ చింతా ఎరగని నా జన్మ కిదో పెద్ద మనోవ్యాధి అయిపోయింది.

ఇవన్నీ బహిరంగంగా చెప్పవలసినవి కావు. కాని ఉన్న సందర్భమంతా పూసగుచ్చినట్టు చెప్పకపోతే నా వల్ల నేరం వున్నదీ లేందీ మీ కెలా తెలుస్తుంది ?

నా పెళ్ళాం అందరాడవాళ్ళల్లే వుండటమే కాకుండా వారు వాళ్ళ మొగుళ్ళను చూస్తున్న దానికన్న నన్ను చాలా చులకనగా చూసేది. నన్నన్నీ అసందర్భమైన ప్రశ్నలు వేసేది. త్వరగా వంట కానీవే అంటే 'మిమ్మల్ని వెనకనించి అలా తరుముతుంటే మీ రాఫీసులో మొగాళ్ళు పని చెయ్య గలరు? ప్రతిరోజూ మీ చేత అలా అనిపించుకోవాలంటే చూడండి ప్రాణం యెలా వుంటుందో' అంటుంది. 'కావాలని ఎన్ని సంవత్సరాలైనా వంట చెయ్యొచ్చుగాని, వంట చెయ్యక తప్పదు, విధి అనుకుంటూ ఒక్కరోజు కూడా చెయ్యలే మమ్మా' అంటుంది.

"ఏమండోయి ! ఇవాళ పొద్దున మీరిలా ఆఫీసుకు పోగానే మీ బావగారొచ్చారు" [నా మేనత్త కొడుకన్న మాట]

"ఊ!"

"'వాడున్నాడా?' అన్నారు"

"నన్ను నువ్వు 'వాడు' అనవచ్చునా?" నేను.

నా పెళ్ళాం ముక్కుమీద వేలుపెట్టుకుని, "రామ! రామ! నేను మిమ్మల్ని వాడన్నానుటండీ!"

"వా...డున్నాడా అన్నాడంటివే!"

"అవును. ఆయన మాటలే అవి"

"అలా అనగూడదు."

"వారున్నారా అన్నా రనాలా?"

నాకీ పాటికల్లా చిరాకువచ్చి నోరు మూసుకోమంటాను. నేను మాటాడలేక తిడుతున్నా నంటుంది. మాటకు మాట చెప్పటం అసహ్యమేకాని ఇంతమాత్రానికే మాట్లాడలేక పోతామా? ఇదీ వరస.

పువ్వు పుట్టగానే పరిమళిస్తుందిట కాపరానికి వచ్చిన రోజు లగాయితు దానిబుద్ధి ఎప్పుడూ ఒక్క దిక్కుకే ఈడుస్తుంటే! తల్లో పిన్నులు కావాలి. పౌడర్లు కావాలి. మాసపత్రికలు కావాలి. ఒక్కటికూడా యిచ్చానని కల్లోకూడా అనుకోకండి. నా వుద్దేశం తెలీకుండా, మొగుడ నైనా విచారించకుండా, సిరుడబ్బు ఖర్చవుతుందని భయం అనటం పతివ్రత లక్షణమేనా?

దీన్ని ఏమిటి చెయ్యటం అని చాలా దిగులు కలిగింది నాకు. బాగా యోచించిన మీదట నా కొక్కటే ఉపాయం కనపడ్డది. ప్రతిరోజూ దానికి పతివ్రతల కథలు చదివి వినిపించటం మొదలుపెట్టాను. నే నెప్పుడో మహాపతివ్రతలకథ లని ఒక పుస్తకం కొన్నాను. అది ఇప్పు డక్కరకొచ్చింది. తరవాత రామాయణం చదివాను.

ఒకరోజున నా భార్యకు పెద్ద సందేహం వచ్చింది.

"ఏమండీ సీత మంచి పతివ్రతేనా?"

"అమ్మా! లోకంలో ముగ్గురు పతివ్రతలలో ఒకతె"

"ఎవరెవరండీ!"

"అహల్యా, ద్రౌపదీ, సీతా—వీరు ముగ్గురూ."

"అహల్యంటే ఇంద్రుడితో!-"

"అలా అంటే కళ్ళు రెండూ పోతై."

"ద్రౌపది పంచపాండవుల పెళ్ళాంకదా?"

"అబ్బో నీపాతివ్రత్యానికి వీళ్ళ నెక్కిరించ వచ్చావే! సీతకేం వంక పెట్టావు?"

"అంతా వంకే! అంతకన్న నేనే మంచి పతివ్రతను,,"

"ఎందువల్లో?"

"ఎందువల్ల కాదో! ముందు సంగతసలు-సీత రాముణ్ణి నువ్వంటుందేం? యేమిరా అని కూడా అన్నది"

ఈ వాదన కేం చెప్పను ? అప్పటిమట్టుకు కోప్పడి నోరు మూశాను. మర్నాడు మళ్లీ ఈ సంగతే యెత్తింది మా ఇంటిది ఆలోచించగా నాకే అంత బాగా లేదు, సీత రాముణ్ని గౌరవంగా పిలవకపోవటం. తరవాత నేను బాగా తెలిసిన పెద్దమనిషి నడిగా నీ విషయం. ఆయన చెప్పిందంతా అర్థం కాలేదు. కాని ఉన్న సందర్భం యించుమించుగా ఇది: సీతా రాముడూ-వాళ్ళూ వాడిన భాష తెలుగు కాదట అది సంస్కృతం అన్నాడాయన. ఎందువల్లంటే అది దేవభాష కనక భగవంతుడి అవతారాల్లో అదే ఉపయోగించ బడ్డదన్నాడు. తదుపరి సంస్కృత వ్యాకరణం మన తెలుగు వ్యాకరణమల్లే కాక గొంతు పట్టేస్తుందిట. దాని ప్రకారం యెదురుగా ఒక్క మనిషి వున్నప్పుడు ఆ మనిషి దేముడయ్యేది రాజయ్యేది ఏకవచనం మాట తల పెట్టకూడదట. అందుచేత సీత సంస్కృతంలో రాముణ్ని

యేకవచనంలోనే సంబోధించింది. తెలుగులో తర్జుమాచేసిన పెద్దమనుష్యులు ఆ యేకవచనం యేకవచనంగానే ఉంచారట. యిదంతా నా పెళ్ళానికి చెప్పిన మీదట ఎవరినో అడిగి కనుక్కున్నా నన్నది. తనకు కావలసింది యేకవచనమా, నేను కనుక్కోటమా?

అయితే యేం? రాపాడగా రాపాడగా రాళ్ళైనా అరుగుతై. క్రమంగా నా పెళ్లానికి పాతివ్రత్యాన్ని చూస్తే గౌరవం ప్రారంభించింది. నన్ను పతివ్రత లక్షణాలు, పతివ్రతా మహాత్యం వీటిని గురించి అడగటం మొదలుపెట్టింది. చావుకు పెడితే లంఖణాలకు రాకపోతుందా అని, నా బుద్ధికి తోచినవన్నీ చెప్పాను.

## 2

అదే మొదలనుకోండి నా కష్టాలకూ, అపఖ్యాతికీ.

పాతివ్రత్యాన్ని గురించి నా అభిప్రాయం నలుసంతైనా మారిందనుకోవద్దు—నే నంత తేలిగ్గా అభిప్రాయాలు మార్చుకునేవాణ్ణి కాను—కాని ఈ పాతివ్రత్యాన్ని శాస్త్రోక్తంగా ఆచరణలో పెట్టాలంటే కొంత ఇబ్బంది కలక్కపోదు.

ఒకరోజు ఉదయం నేను నిద్రలేచి పక్కమీదినించి లేవబోతూండగా నా పెళ్లాం వచ్చి నన్ను లేచి నుంచోమని వంగి కాళ్ళంటుకుని కళ్ళకద్దుకుంది. ఈ చర్య నాకు వెంటనే అర్థంకాలేదు. తర్వాన నాకు సిగ్గూ, అసహ్యమూ కలిగి ఏమి

టి వేళాకోళం అనబోతుండగా జ్ఞాపకం వచ్చింది! ఆరోజు కంతటితో పోయింది. ప్రతిరోజూ ఈ విధంగానే చేస్తుందా యేమిట్రా భగవంతుడా అని భయం వేసింది. కాని మరిచి పోక పోతుందా అనుకున్నాను. మరిచిపోయింది నేను. మర్నాడు మళ్లీ ఈ ప్రకారమే-జరిగింది. ఆ మర్నాడు, ఆ మర్నాడు. ఆపని పోనీ చెయ్యకపోతేయే మందామని నోటిదాకా వచ్చింది. కాని ఎలా అనను? నేను చదివిన కథలన్నీ ఇందు కేగా? ఈ నమస్కారాలు చేయించుకోటం కాకపోయినా నా ప్రాణానికొచ్చింది.

ఒకరోజు జ్ఞాపకం పెట్టుకుని అది లేవకమునుపే లేచి బయటికివెళ్ళి ఎనిమిదింటి కొచ్చాను. అలా తప్పుతుందా? నేను కనపడగానే నన్ను నిలవబెట్టి, నా పాదాలు కళ్ళకద్దు కుంది. మర్నాడుకూడా చీకటితోనే లేచిపోయి అది మడి గట్టుకున్న తరవాత వచ్చాను. కాని తప్పలేదు. మళ్ళీ మడి గట్టుకుంటానన్నది. ఆఫీసుకు శెలవరోజుగా చూసి ఒంటిగంట కింటికి వచ్చినా తప్పలేదు. ఇల్లు వదిలి దేశంమీద లేచి పోయేవాళ్ళ భార్యలందరూ చెడ్డవాళ్ళని చెప్పలేం!

యింకో మోసంకూడా జరిగింది. తెల్లవారుగట్ల గదిలో నమస్కారాలు చేయించుకుంటే ఎవరికీ తెలీదేమో కాని కొంత పొద్దెక్కిన తరవాత ఆరుబయట చేయించుకున్నారో, లోకమంతా తెలిసిందే! ఓ భార్య ఇతరులుచూసి ఏమను కున్నా లెక్కచెయ్యని పతివ్రత అయితే అడగక్కర్లేదు.

దీనితోనే నాకు దాన్ని చూస్తే హడలయిపోతే, ఇది చాలక పూర్వం చేసుకునే షోకులన్నీ మానేసి జుట్టు గోళ్ళ

తోనే దువ్వి కొప్పు పెట్టుకుంది, పెద్ద కుంకంబొట్టు పెట్టింది. నీరుకాయ చీరలు కాశపోసి కట్టి భీకరాకారం దాల్చింది. రామ రామ! మనిషిలో ఒక్క రవ్వయినా ఆకర్షణ లేకుండా పోయింది. కుక్కిన పేనల్లే వుండవలసిందే కాని వులకటానికీ పలకటానికీ వీలు లేదు. అక్కడికీ మనసు పట్టలేక ఈ అవతారంలోనే అందంగా వుండకూడదా అంటే, నవ్వి, 'ఏం పిచ్చండీ మీకు? అందంగా వుండాలంటే షోకులే చేసుకోరాదా ఏమిటి?' అది. అంతటితో నా నోరు కట్టు.

కొద్ది కాలమయిన తరవాత నా భార్య, నే నుత్త నమస్కారాలతో తృప్తి పడటం లేదనేమో, పూజా నమస్కారాలు ప్రారంభించింది. వుదయం నేను లేవగానే పూలతో తయారు. అవి నా కాళ్ళమీద పూజచెయ్యటం, ఆ పూలు కొప్పులో పెట్టుకోటం.

"పూలన్నీ నాకే పూజచేస్తే దేముడికో !" అన్నా నొకనాడు.

"దేముడికి పూలెందుకు? నేను దేముడి పూజ మానేశాను."

నా గుండె బద్దలయింది. తరతరాలనించి వస్తున్న దేముడిపూజ యిప్పుడు మానేస్తే నెత్తి అదుస్తుంది!

"ఎందుకు మానేశావు ?" అన్నాను గదమాయించి.

అది మహా వినయంతో "క్షమించండి, నాకా దేముడితో పని లేదు. నా కా రాతిలింగాల్లో, ఇత్తడి బొమ్మల్లో నమ్మకం పోయింది జ్యోతల్లే మీరు సాక్షాత్తూ నా కళ్ళక్కనపడుతుంటే—"

"నివేదనైనా చేస్తున్నావా?"

"లేదు"

నాకు తక్షణం ఎక్కడికైనా పోయి ఎక్కెక్కి ఏడవాలనిపించింది.

దాన్ని కోప్పడి యేమీ లాభంలేదు ఇప్పుడీ ధోరణి మారి వెనకటి తోవలోపడితే నన్ను గడ్డిపరకకింద చూడదు. నేను సన్యసించ వలసినవాణ్ణే. దేవతార్చన చూసినప్పుడల్లా గుండె బద్దలవుతున్నది. ఎంతకాలం దేవుడీ అకార్యం వోరుస్తాడు ? దానికేం ? దాని పాతివ్రత్యం దాన్ని రక్షిస్తుంది. దెబ్బపడేది నా నెత్తిన

ఈ దుస్థితిలో ఒకనాడు నా భార్య నాతో, అమృతమంటి మాట ఒకటి అన్నది.

"యేమండీ, ఇట్లా పూజా పునస్కారాలు లేక పోవటం నాకు బాగాలేదు"

"అద్భుతమైన మాట అన్నావు. నీ బుద్ధి కింతమంచి ఆలోచన ఈ మధ్య ఎన్నడూ వచ్చినట్టు నాకు గుర్తులేదు ! దేవతార్చనకు మామూలు ప్రకారం పూజా నివేదనలు చెయ్యి."

అది నాకు వళ్ళు మండేటట్లు తల అడ్డాగా తిప్పి "అది కాదు, ప్రతిరోజూ మీకే పూజ చేస్తాను" అన్నది

నా వెంట్రుకలు ఒక్కసారి నిక్కపొడుచుకున్నై. భయంతో శరీరం యావత్తూ కంపర మెత్తింది. ఎలా వద్దను ?

నా చేత స్నానం చేయించింది. మా అత్తవారిచ్చిన

బరంపురం పట్టు తాపితాలు తడిపి ఎండేసి, అవి నా చేత కట్టించింది. ఒక పీటమీద పసుపురాచి ముగ్గుపెట్టి దానిమీద కూర్చోమంది. పట్టుబట్టలు చెడిపోవాలంటే వెధవ పట్టుబట్టలు పోతేపోయినయ్యింది. కూర్చున్నాను. నెత్తినిండా పూలు అక్షింతలూ వేసింది. నీరు చిలకరించింది. బట్టలన్నీ ధ్వంసమయినాయి, నేను సగంపైగా చచ్చిఉన్నాను.

ఈ సమయంలో 'దొడ్డమ్మా' అంటూ వచ్చాడు పడిపోయినట్టు మా మరదలి కొడుకు నాపాలిటి యమకింకరుడల్లే!

ఇంకా ఈ విధంగా జరుగుతునే వుంది. కాని నేను తగిన మనోబలం తెచ్చుకుని త్వరలో ఇది అంతమయ్యేటట్టు చేస్తాను. నన్ను కుక్కను చూసినట్లు చూస్తే చూసింది, నా భార్య మళ్ళీ నా దగ్గిరికి వాలుజడేసుకుని, చక్కని చీర కట్టుకుని, మొహాం సబ్బువాసనా, ఫేసు పౌడరువాసనా కొట్టుతూ వస్తుందాలని అనుకున్నప్పుడల్లా గుండె నీరవుతున్నది.